క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



ముగ్గును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, చైర్‌పర్సన్ జిందం కళ, ఎస్పీ రాహుల్‌హెగ్డే సతీమణి విజ్వేత పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. అలాగే వివిధ మండలాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆస్పత్రి కోసం బీజేపీ నిరసన



సంతకాలు సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించాలని బీజేపీ నాయకులు ఇల్లంతకుంటలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాలకు ఒకటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి నాలుగేళ్లు దాటుతున్న ఇప్పటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని అన్నారు. మండల ప్రజలకు మెరుగైన సర్కారు వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసన్న, స్వామి, గంగాధర్, రజినికాంత్, రంజిత్, కిషన్, రాజు, కృష్ణ, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలి



ప్రచారం చేస్తున్న పోస్టల్ అధికారులు

కోనరావుపేట: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ కోరారు. పోస్టల్ అమలు చేస్తున్న పథకాలపై జనవరి 1 నుంచి గ్రామాల్లో మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల సవరించిన వడ్డీరేట్లతో పోస్టల్ పథకాలు ఎంతో ఆకర్షణీయంగా మారాయన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు అందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల ప్రజలు ఈ పథకాలలో చేరి ప్రయోజనాలను పొందాలన్నారు. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, పోస్టల్ అధికారి రాగుల భూంరెడ్డి, నాయకులు వంగపల్లి శ్రీనివాస్, బీపీఎంలు పాల్గొన్నారు.

హరిదాసుల కీర్తనలు, అందమైన రంగవల్లులు, మధ్యలో పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు.. ఇలా జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం మకర సంక్రాంతి పురస్కరించుకుని అన్ని ఆలయాల్లో ఇష్ట దైవాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు వాకిళ్లను కల్లాపితో శుభ్రం చేసి అందమైన ముగ్గులతో అలంకరించారు. చిన్నపిల్లలకు సంప్రదాయంగా భోగిపండ్లను పోశారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రజలు గాలిపటాలను ఎగురవేసి సంతోషాలను పంచుకున్నారు. సోమవారం కనుమ పండుగ పురస్కరించుకుని పశు సంపదకు పూజలు చేశారు. ఎద్దులు, ఆవులు, గేదెలను అలంకరించి సంబరాలు నిర్వహించారు. రకరకాల పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. గంభీరావుపేటకు చెందిన లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి అనే నాయకుడు ఇంటి ముందు ముగ్గులతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలను వేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. - సాక్షి నెట్‌వర్క్

సంక్రాంతి సంబురం



సిరిసిల్లలో భోగిపండుగ జరుపుకుంటున్న ఓ కుటుంబం



గంభీరావుపేట: ఓ ఇంటి ముందు ముగ్గులతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ముఖచిత్రాలు



సిరిసిల్లలో ముగ్గు వేస్తున్న మహిళలు



బోయినపల్లిలో ముగ్గు వేస్తున్న మహిళలు



వేములవాడరూరల్: గంగిరెద్దుల విన్యాసం



సిరిసిల్లలో ముగ్గు వేస్తున్న మహిళలు, యువతులు

కంటి వెలుగును విజయవంతం చేద్దాం

ముస్తాబాద్: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో కంటివెలుగుపై సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలలకు పైగా గ్రామాల్లో కంటి పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేస్తారన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి గీతాంజలి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

వీర్నపల్లి: ప్రభుత్వ నిర్వహించ తలపెట్టిన కంటి వెలుగుపై మండల కేంద్రంలో మండల అభివృద్ధి అధికారి నరేష్ కుమార్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. కంటి వెలుగుకు సంబంధించిన వసతి సౌకర్యాలను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో, స్థానిక సర్పంచ్ దినాకర్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్ఐ, పంచాయతీ సెక్రెటరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

బోయినపల్లి: మండలంలో ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాటు పనులను పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఏర్పాట్లపై సోమవారం సమీక్షించుకున్నారు. కంటి పరీక్షలు చేసేందుకు అవసరమైన ఆప్తో మెట్రిషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏఆర్ మిషన్లు వచ్చినట్లు బోయినపల్లి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శశి తెలిపారు. కార్యదర్శి రాజసులోచన శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా కాట్రేవుల ఉత్సవం

కోనరావుపేట: మండలం కనగర్తిలో సంక్రాంతి సందర్భంగా రైతులు కాట్రేవుల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు తమ పశువులను శుభ్రంగా కడిగి ఎడ్లకు, బర్ల కొమ్ములకు తైలాలను పూసి అందంగా అలంకరణ చేశారు. పందిరి వేసి పశువుల కాపరిగా బావించే కాటమరాజు ప్రతిమ, పశువుల ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. పూజించిన జలాలను పశువులపై చల్లారు. పశువులను కాటమరాజు ప్రతిమ చుట్టూ తిప్పుతూ తమ పశు సంపదను కాపాడాలని వేడుకున్నారు. పూర్వకాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, రైతు నాయకుడు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ కన్వీనర్ నర్సింహరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కాటమరాజు ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న రైతులు



అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై భారీ కయ్య

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక నుంచి విలాసాగర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు ప్రారంభంలో రోడ్డుపై భారీగా కయ్య పడింది. కయ్యను దాటేందుకు వాహనదారులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. రోడ్డు మొత్తం పరుచుకుని ఉన్న కయ్యను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: యాదగిరి, పీఆర్, ఏఈ, బోయినపల్లి
ఫోన్ నంబర్: 98496 84941

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భగవంతరావునగర్, చెక్కపల్లి రోడ్డు, శ్యామకుంట, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, భీమేశ్వరాలయం వీధి, రాజన్న ఆలయ ప్రాంతం, మేయిన్ రోడ్డు, కాలేజ్ రోడ్డు, బద్దిపోచమ్మ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయానికి సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంఘాలు - ఎన్నికలు

మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షుడిగా పర్శరాం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజిపేట మున్నూరు కాపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జంకె పర్శరాం, ఉపాధ్యక్షుడుగా పరశురాం, కోశాధికారిగా మల్లేశం, కార్యవర్గసభ్యులుగా మల్లయ్య, మధు, నాగరాజు, రాము, మల్లేశం, దేవయ్య, స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుల సంఘ సభ్యులు వారిని అభినందించారు.

నూతన కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల స్మైల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సబ్బని ప్రకాశ్, కార్యదర్శి లక్కం శేఖర్, కోశాధికారి సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

పండుగలు ఉత్సాహాన్ని నింపుతాయి

- సికింద్రాబాద్ సీనియర్ సివిల్ జడ్జి గజవాడ వేణు

వేములవాడ: పండగలు ఉత్సాహాన్ని నింపుతాయని సికింద్రాబాద్ సీనియర్ సివిల్ జడ్జి గజవాడ వేణు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పరస్కరించుకుని మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పతంగిల పోటీలలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పెండ వంశీ రూ.2వేలు, ద్వితీయ శ్రీనివాస్‌కు రూ.1500, తృతీయ వెంకటేశ్‌కు రూ.వెయ్యి, మరో ఇద్దరికి రూ.500 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. నగుబోతు రవీందర్, మధు మహేశ్, బెజ్జంకి రవీందర్, తాళ్లపల్లి ప్రశాంత్, బసవరాజు, నాగుల చంద్రశేఖర్, ప్రతాప నటరాజ్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, కలీంపాష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న జడ్జి వేణు

ఇంటికో ఉద్యోగం ఏదీ?

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: ఇంటికో ఉద్యగమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతరాన్ని మోసం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలోకి సోమవారం కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన మధు ఆధ్వర్యంలో 30 మంది యువకులు చేరారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతీ యువకుడు కృషి చేయాలని కోరారు. కోనరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, నిమ్మపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భూమేశ్, బక్కన్న పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

డీఎల్పీవో, ఎంపీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కోనరావుపేట: గ్రామసర్పంచ్, కార్యదర్శిలపై ఫిర్యాదు చేయగా వచ్చిన అధికారులు ప్రజలు లేకుండా సర్పంచ్ కుటుంబ సభ్యుల సమక్షంలో విచారణ జరిపారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోనరావుపేట గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండల కేంద్రంలో 40 ఫీట్లు ఉండాల్సిన మేయిన్ రోడ్డులో ఒక చోట సర్పంచ్‌కు అనుకూలంగా ఉన్నవారి ఇళ్ల వద్ద 30 ఫీట్లు, సర్పంచుకు వ్యతిరేకులు ఉన్న చోట 50 ఫీట్ల రోడ్డు వెడల్పును చేస్తున్నారని, అలాగే చిన్న చిన్న రోడ్లను వెడల్పు చేయకుండా పాత రోడ్లకు పర్మిషన్లు ఇచ్చి రోడ్లను వేయిస్తున్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని 2022 నవంబర్ 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. విచారణకు వచ్చిన డీఎల్పీవో, ఎంపీవోలు ప్రజల సమక్షంలో విచారణ జరుపకుండా సర్పంచ్, సర్పంచ్ భర్త, మామ సమక్షంలో విచారణ జరిపి, వారు చెప్పింది రాసుకుని నివేదిక ఇచ్చారన్నారు. తప్పుడు నివేదిక సమర్పించిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రత్యేకాధికారిచే విచారణ జరుపాలని కోరారు. వీరిలో అబ్బసాని శంకర్ గౌడ్, చందనగిరి గోపాల్, పాత్కాల కాంతయ్య, మాందాల శ్రీనివాస్, గొట్టె శంకర్, మోతుకు మోహన్, జైహింద్‌రెడ్డి, అనిల్‌యాదవ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్డీవోకు గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడడంతో తీవ్రగాయాలు కాగా హైదరాబాద్ తరలించారు. కరీంనగర్‌లో బైక్‌పై నుంచి ఒకసారి కిందపడడంతో పొట్టభాగంలో తీవ్ర గాయాలైనట్లు బంధువుల ద్వారా తెలిసింది. సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. కిడ్నీకి సంబంధించిన ప్రాంతంలో తీవ్రంగా గాయం కావడంతో హైదరాబాదులో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

శివ భక్తుడిని కొట్టిన ఎస్ఐపై వేటు

సిరిసిల్లక్రైం: శివమాలలో ఉన్న భక్తుడిపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారి సోమవారం వేటు వేశారు. శివమాల ధరించిన భక్తుడిని వేములవాడలో ఇటీవల వేములవాడ టౌన్ ఎస్ఐ తిరుపతి కొట్టారు. ఈ విషయంపై వివరాలను సేకరించి పరిశీలించిన ఎస్పీ రాహుల్‌హెగ్డే ఎస్ఐ తిరుపతిని జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. సదరు అధికారిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

సర్పంచ్ మృతి




బాలయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కనకట్ల బాలయ్య (68) సోమవారం తెలవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స అనంతరం అస్వస్థతతో ఉన్న ఆయనను ఇంటికి తీసుకువచ్చిన తరువాత మృతి చెందాడు. మంత్రి కేటీఆర్ ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు. వెంకటాపూర్ సర్పంచ్‌గా 2003 నుంచి 2007 వరకు పనిచేసిన బాలయ్య 2013లో పోతిరెడ్డిపల్లిని ప్రత్యేక గ్రామపంచాయతీగా మారినప్పటి నుంచి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా కొనసాగుతున్నాడు. పీపుల్స్‌వార్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన బాలయ్య మిలిటెంట్‌గా, కొరియర్‌గా, దళ సభ్యుడిగా పనిచేశాడు. మూడుసార్లు కాల్పుల నుంచి తప్పించుకున్నాడు. ఆయనకు భార్య సత్తవ్వ, కుమారులు శ్రీనివాస్, మహేందర్, కూతురు ఉన్నారు. అంత్యక్రియల్లో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, ఎంపీపీ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

కల్లాలు లేక కర్షకుల అవస్థలు

సిరిసిల్లటౌన్: కల్లాలు లేక కర్షకులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి అవస్థలు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు 200 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు అందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర సర్కారు రూ.157 కోట్లు కల్లాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తే..కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో ఈ నిధులు కేటాయించకూడదని కొర్రీలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వమే గ్రామాల్లో కల్లాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పదిహేను రోజుల్లో కల్లాలు ఏర్పాటుకు నిధులు కేటాయించకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జంగపల్లి అంజయ్య, కేవీ అనసూయ, మంచికట్ల రమేశ్, ప్రభాకర్, నాగరాజు, అమీనా, రాములు, జాన్సన్, పరుశురాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటి వేణు

భూములు తిరిగి ఇచ్చేయాలి

వేములవాడఅర్బన్: నాంపల్లి శివారులోని నిరుపేదలకు ప్రభుత్వం రద్దు చేసిన పట్టా భూములను తిరిగి వారికి కేటాయించాలని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 1991లో నాంపల్లికి చెందిన నిరుపేదలకు అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు భూముల పట్టాలను అందించగా, రైతులు పంటలు పండించుకున్నారన్నారు. కాని ఆ భూమిలో ప్రభుత్వం అందించిన పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారన్నారు. భూమి తిరిగి ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనుడి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి పంచాయతీ పరిధిలోని బంగిరెడ్డితండాకు చెందిన అజ్మీరా మోహన్(45) ఆదివారం ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మోహన్ తనకున్న భూమిలో వరిపంట సాగుచేశాడు. పంట సరిగ్గా ఎదుగలేదు. పంటకు, కుటుంబ పోషణకు రూ.4లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

ఓపీఎస్ విధానమే లక్ష్యం

ఇల్లంతకుంట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేసే వరకు పోరాటమే లక్ష్యంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం లక్ష్యమని సీపీఎస్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్ని రాష్ట్రాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం కూడా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని ఆసాములు, కార్మికుల సమస్యలను సర్కారు వెంటనే తీర్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు.

బీసీ (ఏ) గ్రూప్‌కు అన్యాయం చేస్తే సహించం

సిరిసిల్లకల్చరల్: బీసీ ఏ గ్రూప్‌కు ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేస్తే సహించబోమని ఆ గ్రూప్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మానస గణేశ్ అన్నారు. సోమవారం గంగపుత్ర సంఘ భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌లను ఆంధ్ర ప్రాంతానికి చెందిన కులాలను బీసీ ఏ గ్రూప్‌లో చేర్చే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. సమితి రాష్ట్ర కార్యదర్శి ఎం ఎస్ నరహరి, కోశాధికారి అబ్బు లింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సాంబమూర్తి, కర్రె రమేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీభూమిలో సాగుకు యత్నించిన వ్యక్తులపై కేసు నమోదు

అటవీభూమిలో సాగుకు యత్నించిన వ్యక్తులపై కేసు నమోదు

కోనరావుపేట: కోనరావుపేట సెక్షన్‌లోని నిమ్మపల్లి బీట్ పరిధిలో గల ఎగ్లాస్‌పూర్ అడవిలో నాగండ్లకుంట ప్రాంతంలో అడవిని నరికి వ్యవసాయానికి ప్రయత్నించిన అక్కెనపల్లి రాములు, వేముండ్ల రాములు, మంగలి రాజయ్యలపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు సెక్షన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు తొందరగా పూర్తిచేయాలి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి వంగ అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాయావతి పుట్టిన రోజు వేడుకలు

గంభీరావుపేట/కోనరావుపేట: బీఎస్పీ నాయకురాలు కుమారి మాయావతి జన్మదిన వేడుకలను బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు.